
# శవరాజకీయం

ఎల్. దేవకి



స్వరాజ్యానికి మొన్ననే అయిదేళ్ళొచ్చాయి.

ఆ సందర్భంగా పుట్టినరోజు ఒక పండగనీ, పబ్బమనీ ఏమీ చేయలేదు స్వరాజ్యం తల్లిదండ్రులు.

అసలు వాళ్ళ కవంటే ఏమిటో, ఎట్లా చేసుకుంటారో కూడా తెలియదు.

వాళ్ళకు తెలిసిందల్లా ఒకటే-ఆకలి !

ముమ్మాటికీ ఆకలి ... ఆకలి ... ఆకలి !

నాలుగు తరాలుగా వాళ్ళకు ఆకలే ఆస్తి ... ఆకలే సర్వస్వం... ఆకలే వారసత్వంగా వస్తోంది.

రెండేళ్ళయింది. ఆ పల్లెలో ఒక పాడీ లేదు, ఒక పంటా లేదు.

పోనీ ఏదో ఒక పని చేసి పొట్ట పోసుకుందామా అంటే అసలు పన్లే లేవాయె అంతటా కరువు కరాళనృత్యం చేస్తోంది. మొత్తం జిల్లా జిల్లా అంత ఎక్కడి కని పోతుంది? ఏం జరిగితే అది జరుగుతుంది లెమ్మని ఎక్కడివా ళ్ళక్కడ కాటికి కాళ్ళు చాచుకు కూర్చుండిపోయారు.

జిల్లా అంతటినీ ఒక మహా నిస్సహాయత ఆవహించినట్లయింది.

కరువు బృంద మొకటి పర్యటించి వెళ్ళటంతో ప్రభుత్వం వారు ఆ జిల్లా నంతటినీ 'కరువు ప్రాంతం'గా ప్రకటించి పారేశారు. రైతుల శిస్తు బకాయిల్నీ విద్యార్థుల ఫీజుల్నీ మాఫీ చేశారు. సహకార బ్యాంకుల ఋణాల్ని తాత్కాలికంగా వాయిదా వేసి, కంటితుడుపుగా వడ్డీని మాత్రం రద్దు చేశారు. కరువు నుంచి ఆ జిల్లా ప్రజల్ని బ్రోచే నిమిత్తం తక్షణమే మూడు కోట్ల రూపాయల్ని మొదటి విడత ఆర్థిక సహాయంగా మంజూరు చేశారు ఎంతో ఉదారాన్ని కనబరుస్తూ ముఖ్యమంత్రి.

వాస్తవాని కా జిల్లాలో నెలకొన్న కరువు రక్కసి పీడ మూడు కోట్లు కాదు కదా మూడు వందల కోట్ల క్కూడా వదిలేది కాదు.

కళ్ళనీళ్ళు తుడిస్తే కాలే కడుపులు నిండుతాయా?

అధికారులే తిన్నారో, అధి నాయకులే తిన్నారో గానీ ఎట్లాంటి కరువు సహాయ కార్యక్రమాలూ చేపట్టకుండానే ముప్పయి రోజులు గడిచేసరికల్లా మూడు కోట్లకు గాను మూడు రూపాయలు మిగిలినై.

ప్రభుత్వ నిధులకు కాలం చెల్లిపోవటంతో ఇక ఆకలిచావుల కాల మొకటి వచ్చేసింది.

మొదటి రోజు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఒకటీ, కుంటముక్కల మండల హెడ్ క్వార్టర్స్‌లో ఒకటీ, మొత్తం పల్లెల్లో అయిదు ఆకలి చావులు నమోదయ్యాయి. అంటే మొత్తం మొదటి రోజు ఆకలి చావులు వెరసి ఏడన్న మాట.

అట్లా వారం రోజులు తిరిగేసరికల్లా ఎనభై నాలుగు ఆకలిచావులు రికార్డయ్యాయి కలెక్టర్ కార్యాలయంలో. ఏ రోజు ఆకలిచావుల సంఖ్యను ఆ రోజే సాయంత్రం సచివాలయాని కందే ఏర్పాటు చేశారు రెవిన్యూ వారు.

జిల్లా అంతటా ఎక్కడ చూసినా ఆకలిచావులే ! ఎవరి నోట విన్నా ఆకలి కేకలే !

పేపర్లు పది రోజులు రాసి రాసి వార్త పాతపడిపోవటంతో పూర్తిగా మానేశాయి.

ఈ ఆకలి చావుల్ని రాష్ట్రంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలూ తమ తమ విభేదాల్ని మరచిపోయి ముక్తకంఠంతో ఖండించాయి. తక్షణం విషయాన్ని చట్టసభలో చర్చించేందుకు అసెంబ్లీని సమావేశపరచవలసిందిగా ముఖ్యమంత్రిని అదేపనిగా డిమాండ్ చేశాయి.

ఒకరోజు రాజధానిలో ప్రతిపక్షాలన్నీ సంయుక్తంగా ఒక ప్రదర్శనను నిర్వహించి, గవర్నర్ నివాసాని కెళ్ళి ఒక 'మెమొరాండం'ను కూడా సమర్పించారు.

అది చాలదన్నట్లు 'రాష్ట్ర వ్యాపిత బంద్'కు సన్నాహాలు తలపెట్టి తేదీని కూడా నిర్ణయిస్తూ ప్రభుత్వానికి చిట్టచివరిగా ఒక 'అల్టిమేటం' కూడా ఇచ్చాయి ప్రతిపక్షాలన్నీ ఒక కట్టుగా నిలబడి.

'బంద్'కు ప్రభుత్వం లొంగి రాకపోతే ప్రతిపక్ష నాయకుల బృంద మొకటి త్వరలో పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించవలసుకుంది. అందులో భాగంగా రాష్ట్రపతికీ, ప్రధానికీ సమర్పించేందుకు అప్పుడే నివేదికలను కూడా సిద్ధం చేశారు.



ఇదంత ఇంటెలిజెన్సీ రిపోర్టుల ద్వారా తెలుసుకున్న ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పోశాయి. హుటాహుటీ మంత్రివర్గాన్ని సమావేశపరిచి కరువు సమస్యను కూలంకషంగా చర్చించారు ముఖ్యమంత్రి. ఆకలి చావుల్ని ఎట్లా నిరోధించాలో ఎంత ఆలోచించినా ఎవ్వరికీ బోధపడళ్ళే దా సమావేశంలో.

సమస్యా పరిష్కారానికి గాను ఏదన్నా సలహాను సూచించవలసినదిగా తన మంత్రివర్గ సహచరుల్ని కోరారు ముఖ్యమంత్రి.

ఆకలి చావుల్ని నిరోధించటం ఎట్లాగూ ఇప్పట్లో సాధ్యపడదు కాబట్టి, ఆకలి చావులు సంభవించిన ఆయా కుటుంబాలవారికి కొంత ఆర్థిక సహాయం చేస్తే సరిపోతుందనీ, ఈ చర్యవల్ల నిజంగా ఆకలి చావుల్నెదుర్కొనే వాళ్ళను ఆదుకోవటం జరుగుతుందనీ సెలవిచ్చాడు రవాణాశాఖ మంత్రి నిత్యం తన శాఖలో ఏం జరుగుతున్నదీ, ప్రమాదాల్లో పరిహారం ఎట్లా చెల్లిస్తున్నదీ సోదాహరణంగా వివరించి.

రవాణా శాఖ మంత్రి సలహా ముఖ్యమంత్రి కెంతగానో నచ్చటంతో ఆ సంతోషంలో ఆయన్ను ఆలింగనం చేసుకున్నాడు. నచ్చడమే తరువాయి దాన్ని మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించి సదరు పాఠాన్ని వెంటనే పత్రికలకు విడుదల చేసింది. ప్రకటన ప్రతిని ముఖ్యమంత్రి స్వయంగా కిక్కిరిసిన 'ప్రెస్ కాన్ఫరెన్సు'లో జర్నలిస్టుల కందజేశారు.

దాని సారాంశం ఏమంటే "ఇకమీదట 'ఆకలిచావు'కు గురై దుర్మరణంపాలైన వ్యక్తి కుటుంబానికి రెండు వేల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం మంజూరు చేస్తుంది" అని.

తెల్లారి పత్రికలన్నీ ఈ విషయాన్ని పతాక శీర్షికల్లో ప్రచురించాయి. ప్రతిపక్షాలు మాత్రం 'పోయిన ప్రాణాలకు విలువను చెల్లించే' ఈ అనాగరిక ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిరసించాయి. ప్రతిపక్షాల నిరసనధ్వనులు 'చెవిటివాడి ముందు శంఖం'లా అయ్యాయి ముఖ్యమంత్రి విషయంలో.

ఇంత ఆందోళన చేస్తున్నా ముఖ్యమంత్రికి చీమకుట్టినట్లైనా లేకపోవటంతో ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహావేశాల్ని వెలిబుచ్చాయి. చీమకుట్టినట్టు ఏ ముఖ్యమంత్రికైనా ఎందుకుండాలి - శాసనసభలో మూడింట రెండు వంతుల మెజార్టీ ఉన్నప్పుడు !

ఆ జిల్లా అంతట్లోకీ ఆకలి చావుల సంఖ్యలో అగ్రస్థానం చింతపల్లిదే. చింతపల్లి ఇంతకు ముందెప్పుడూ పేపరు ముఖం చూడకపోయినా, ఇప్పు డా జిల్లా అంతట్లోకీ 'వార్తల్లో ఊరు"అయ్యింది.

పది రోజుల్లోనూ పాతికమంది చనిపోయా రా 'పల్లి'లో. నిన్న సాయంత్రం తాజాగా వెంకటప్పయ్య 'ఆకలి చావు' చావటంతో ఆ సంఖ్య కాస్తా ఇరవై ఆరుకు చేరింది.

వెంకటప్పయ్య చనిపోయి ఇంకా ఇరవై నాలుగు గంటలన్నా కాలేదు. తెల్లారి పది గంటలకల్లా ఆ మండలాధికారి స్వయంగా జీపులో వచ్చి అక్షరాలా రెండు వేల రూపాయల నగదునీ అతని కొడుకు మల్లేశాని కందజేశాడు. ప్రభుత్వ సహాయాని కెంతగానో సంబరపడిపోయాడు మల్లేశం ఆ రోజంత.

అప్పటికి వారం రోజులుగా తిండిలేని మల్లేశం, అతని కుటుంబ సభ్యులంతా ఆ మధ్యాహ్నం వచ్చిన డబ్బు పెట్టి కడుపుల కింత 'కబళాన్ని' వేశారు.

ఆకలి చావు చచ్చిన వెంకటప్పయ్య ఆత్మ శాంతించిందో లేదో తెలియదు కానీ, మల్లేశం, అతని కుటుంబ సభ్యుల ఆకలి మాత్రం శాంతించిం దా రోజే !

వెంకటప్పయ్య పొరుగునే ఉంది రామయ్య ఇల్లు. ఆ కుటుంబం యావత్తూ పస్తులతో అలమటిస్తూనే ఉంది గత అయిదు రోజులుగా. రామయ్య తాత పరిస్థితి మరీ విషమించటంతో అటో, ఇటోగా ఉంది. తల్లిదండ్రు లా మాట అనుకోవటం స్వరాజ్యం చెవులారా వింది.

స్వరాజ్యం ఎవరో కాదు. స్వయానా రామయ్య తాతకు మనవరాలు. అంటే కొడుకు కూతురు. ప్రొద్దుట్నుంచీ స్వరాజ్యం కూడా మంచినీళ్ళే తాగుతోంది కడుపులో మంటగా అనిపించిన ప్రతిసారీ.

వేళకు కడుపులో బువ్వ పడకపోతే ఎంత బాధగా ఉంటుందో తొలిసారిగా అర్థం కాసాగింది స్వరాజ్యానికి.

శాస్త్రులుగారి కడుపు బానలా ఎందుకుంటుందో, ఎట్టోడు గవరయ్య కడుపు వీపు కతుక్కుపోయి ఎందుకుంటుందో అనుకున్న స్వరాజ్యానికి అందుక్కారణం 'బువ్వే' అని తెలియటానికి ఏడాదిపైనే పట్టింది ... అదీ రామయ్య తాత చెప్తేనే.

స్వరాజ్యం బుల్లి బుర్రలో ఎన్నో ఆలోచనలు...

"మదుసు లందర్నీ పుట్టించింది దేముడైతే మరి అందరికీ బువ్వెందుకు పెట్టడు?" అనుకుంటుండగా రామయ్య తాత ఎప్పుడో అన్న మాట

"పట్వారీ సాబ్ తిండెక్కువై చచ్చిం"దని గుర్తుకు రావటమే తరువాయి, "బువ్వ ఎక్కువైనా సచ్చిపోతారు కాబో"లనుకుంది. "బువ్వ తక్కువైనా, ఎక్కువైనా చచ్చిపోయేటప్పుడు అందరికీ బువ్వ ఇవ్వొచ్చుగా దేముడు?" అనుకుంది.

"ఎప్పటికైనా దేము డట్లా చేత్తే మంచిగుంట" దనుకుంది. పాపం పిచ్చి స్వరాజ్యం!

వెంకటప్పయ్య దేముడి దగ్గర కెళ్ళటమూ... మల్లేశం వాళ్ళకు సర్కారోళ్ళు పైసలివ్వటమూ... ఆ పైసల్తో వాళ్ళు కడుపునిండా బువ్వ తినటమూ... అలా అలా స్వరాజ్యానికి తెలిసిపోయాయి.

ఉన్నట్టుండి స్వరాజ్యం బుల్లి బుర్రలో ఆలోచ నొకటి మెరిసింది.

దాంతో స్వరాజ్యం ఎవరూ చూడకుండా గుడిసె వెనుక ఓ చోట నిల్చుని గట్టిగా కళ్ళు మూసుకుని రెండు చేతుల్నీ జోడించి దేముణ్ణి ప్రార్థించింది.

"ఇంట్లో ఎవరో ఒకరు చనిపోతే గానీ సర్కారోళ్ళు పైసలివ్వరనే" ఒక అపోహ బలంగా నాటుకుపోయింది స్వరాజ్యం పసిమనసులో.

"దేముడా ! ఆ రామయతతను తీసికెళ్ళి మా క్కూడా పైసలియ్యి. మాక్కూడా బువ్వ పెట్టించు దేముడా" అని మొక్కుకుని ఏమీ ఎరగనట్టు రామయ్యతాత కుక్కిమంచం దగ్గర కొచ్చి కూర్చుంది.

'చచ్చిపోయిన వాళ్ళంతా దేముడి దగ్గర కెళ్తారని' స్వరాజ్యం పిచ్చి నమ్మకం.

ఉండుండి రామయ్యతాత కేసి చూస్తోంది. రామయ్యతాత దేముడి దగ్గరకు వెళ్ళినట్టు కనిపించకపోవటంతో నిట్టూరుస్తోంది. స్వరాజ్యం బుల్లి మనసులో మాత్రం రామయ్యతాత ఎప్పుడు దేముడి దగ్గరకు పోతాడా, సర్కారు పైస లెప్పుడిస్తుందా, బువ్వ ఎప్పుడు దొరుకుతుందా-అన్న ఆలోచనలే.

స్వరాజ్యం మొరను విన్నాడో ఏమో, చీకటి పడకముందే 'రామయ్యతాత'ను కాస్తా దేముడు తీసికెళ్ళిపోయాడు.

చెప్పొద్దూ-ఇంటిల్లిపాదీ ఏడుస్తుంటే స్వరాజ్యానికీ ఏడుపొచ్చింది. అప్పు డట్లా మొక్కుకుందే కాని, ఇప్పుడదెంత బాధో తెలియసాగింది.

'ఏడిస్తే దేముడి క్కోపం ఎక్కడ వస్తుందో' అనుకోగానే ఏడ్వటం మానేసింది స్వరాజ్యం.

ఆ రాత్రి కర్రల్ని కట్టి వాటిమీద రామయ్యతతను పడుకోబెట్టి ఎక్కడికో తండ్రి తీసుకెళుతుంటే 'రామయ్యతాత దేముడి దగ్గరికే వెళ్తున్నాడనీ, కాసేపట్లో సర్కారోళ్ళు పైసలతో వస్తారనీ' అనుకుంది స్వరాజ్యం.

'సర్కారోళ్ళు ఎప్పుడైనా రావచ్చని జ్ఞప్తికి రాగానే స్వరాజ్యానికి ఆ రాత్రంతా నిద్ర పట్టింది కాదు. అట్లాగే తెల్లవార్లూ తల్లిదండ్రుల పక్కన మేల్కొనే కూర్చుంది.

తెల్లారింది, కానీ సర్కారోళ్ళు రాలేదు. పోనీ మధ్యాహ్నం వస్తారేమో అనుకుని ఎదురు చూడసాగింది. మధ్యాహ్నమూ రాలేదు. చీకటిపడ్డాక వస్తారనుకుంటే వాళ్ళ జాడే లేదు.

బాగా చీకటి పడింది.

ఆ రోజంత ఇంట్లో ఎవ్వరూ పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టలేదు. స్వరాజ్యం చిన్నపిల్ల అనీ, ఎక్కడ శోషొచ్చి పడిపోతుందోననీ వాళ్ళమ్మ రెండు, మూడుసార్లు నీళ్ళు తాగించింది.

అంత చిమ్మచీకట్లలోనూ కళ్ళను పత్తికాయల్ని చేసుకుని అట్లాగే చూస్తోంది వీధి తలుపులకేసి స్వరాజ్యం.

రామయతాత చనిపోయి రోజు గడిచినా తమ ఆకలి ఆకలిగానే ఎందుకుండిపోయిందో ఎంత ఆలోచించినా అంతుబట్టలే దా చిన్ని స్వరాజ్యానికి.

పైసల్ని మంజూరుచేసే పార్టీ జెండా, తన తండ్రి ఎన్నికలప్పుడు గుడిసెమీద కట్టిన జెండా ఒకటి కాదనీ, అందువల్లే తమకు పైస లిచ్చే విషయంలో సర్కారు కినుక వహించిందనీ, ఎదురుచూస్తున్న ఆ పైసలు ఇక ఎప్పటికీ రావని, పాపం, వెర్రి స్వరాజ్యాని కెట్లా తెలుస్తుంది ...? ★

# నేను చదివిన పుస్తకం

## వర విక్రయము

సంఘంలో జీర్ణించుకుపోయిన వరకట్న దురాచారాన్ని నిర్మూలించాలనే తపనతో, ఆడపెళ్ళివారి అవస్థలను, బాధలను కనులకు కట్టినట్టు సజీవ పాత్రలతో చిత్రించిన నాటకం 'వర విక్రయము'.

మహిళలు చదువుల్లో, తెలివితేటల్లో పురుషుల కన్నా ముందంజ వేసినా కట్నం ఇవ్వడం మాత్రం తప్పడంలేదు. ఈ సమస్య ఈనాడే కాదు, దాదాపు వంద సంవత్సరాలకు పైగానే గట్టి పీఠం వేసుకుని ఆడపెళ్ళివారిని ఎలా పీడించుకు తింటున్నదో తెలియజేస్తుం దీ 'వరవిక్రయము'.

ఈ వరకట్నం సమస్య దిన దినమూ వటవృక్షంలా పెనవేసుకుంటుందే తప్ప తరగడంలేదు.

అరవై అయిదేళ్ళనాటి సాంఘిక పరిస్థితులకు, వరకట్నాలకు, స్త్రీల నిస్సహాయ స్థితికి అద్దం పడుతుం దీ 'వరవిక్రయం'.

కట్నం ఇవ్వడమూ, తీసుకోవడమూ రెండూ నేరమే అని తెలిసినా మన సమాజంలో ఈ వ్యవహారాలు సాగుతూనే ఉన్నాయి.

నేటి కట్నం రేట్లకు తట్టుకోలేక, తల్లిదండ్రులకు భారం కాలేక, వాళ్ళ బాధలను, కష్టాలను చూస్తూ భరించలేక కొందరు అమ్మాయిలు ఆత్మహత్యకు పాల్పడితే, మరి కొందరు క్రుంగి కృశించిపోతున్నారు. ఈ కట్నం విషయంగా ఎందరో అమ్మాయిలు బలి అయిపోతున్నా కట్నం తీసుకునే వారిలో ఎలాంటి మార్పూ రావడంలేదు సరికదా, కోడలు కట్నం సరిగా తేలేదనో, తక్కువ తెచ్చిందనో, ఇంకా ముట్టలేదనో- కొత్త కోడళ్ళను హింసించటం, ఈ కోడల్ని చంపితే ఇంకో కోడలుతో మరింత కట్నం తెచ్చుకోవచ్చుననే ఉద్దేశంతో కొత్త కోడలిపై కిరసనాయిలు పోసి తగలబెట్టడం లాంటి రాక్షసకృత్యాలకు పాల్పడుతున్నారు.

ఇందులోని ప్రధానపాత్ర 'కాళింది' మన అందరి హృదయాల్లో నిలిచిపోతుంది.

తన పెళ్ళికి కట్నం కోసమని తండ్రి పడుతున్న కష్టాలను భరించలేక, తల్లిదండ్రులకు భారం కాలేక కాళింది ఆత్మహత్యకు పాల్పడుతూ - 'తన ఉసురు కట్నం తీసుకునే వాళ్ళందరి కంఠములకు చుట్టుకోవాలనీ, ఈ కుళ్ళు సమాజాన్ని సంఘాన్ని తిడుతూ, కట్నానికి పీడించుకుతినే సింగరాజు, లింగరాజు లాంటి వాళ్ళ నుద్దేశించి ఎన్నో శాపనార్థాలు పెడ్తుంది. ఆమె ఇవన్నీ మనముందే నిలబడి మనల్నే ఉద్దేశించి శపిస్తుందేమో ననిపిస్తుంది మన కా సమయంలో.

ఈ విధంగా ఆమె బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది.

కాళింది చనిపోయిందని తెలిసిన లింగరాజు పశ్చాత్తాపపడకపోగా 'ఆ చావేదో నా కొడుకుతో పెళ్ళయ్యాకనే చావకపోయింది' అనుకుంటాడు విచారంగా. ఎందుకంటే తన ఇంటికి కోడలుగా వచ్చి, కట్నం తన చేతిలో పడ్డాక చస్తే, మరో అమ్మాయిని తను కోడలుగా చేసుకుంటే మరింత డబ్బు వస్తుంది కదా ! అదీ అతని చింత.

ఆ తరువాత కాళింది చెల్లెలయిన కమల రంగంలోకి దిగి లింగరాజు కొడుకుని పెళ్ళాడి మామకు, భర్తకు మొత్తం సమాజానికీ తగు విధంగా బుద్ధి చెబుతుంది.

ఈ నాటకం చదువుతుంటే - ఇందులోని సంభాషణలు, పాత్రల పేర్లు చాలా తమాషాగా ఉంటాయి.

ఈ పుస్తకం చదువుతున్నంతసేపూ - ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం, ఆసక్తిని కలిగిస్తూనే, కట్నం తీసుకోవడం మహాపాపమనీ, మగవాడికి ఇది గౌరవహీనమనీ, డబ్బుకు తను వస్తువులా అమ్ముడుపోయినట్టేనని తెలియజేస్తుంది.

ఇందులోని ప్రధాన పాత్ర [కరివేపచెట్టుమీది కాకిగూళ్ళు పడగొట్టి సంవత్సరమంతా కట్టెల ఖర్చు తప్పించే మహా పరమపిసినారి] అయిన సింగరాజు లింగరాజు లాంటి వాళ్ళ కిదొక చక్కని గుణపాఠం.

ఈ నాటకాన్ని 1922లో ప్రచురించారు. రంగస్థలం మీద ప్రదర్శించడాని కనుగుణంగా పది అంకాలతో రచించారు. మధ్య మధ్య సంభాషణలు, పద్యాలు ఉన్నాయి. పద్యాలు సులువుగా అర్థమయ్యే విధంగా ఉన్నాయి.

ఈ పుస్తకం చదివిన ప్రతి ఒక్కరిలోనూ తప్పకుండా మార్పు కలిగిస్తుందని నా గట్టి నమ్మకం. ఈ పుస్తకం గురించి చెప్పడం కంటే చదివితేనే బాగుంటుంది.

ప్రతి ఒకరూ చదివితీరవలసిన ఉత్తమ నాటకం ఈ వరవిక్రయము.

ఇది కాళ్ళకూరి నారాయణరావుగారి ప్రసిద్ధిగాంచిన నాటకం.

[ఈ నాటకం జయంతి పబ్లికేషన్స్ విజయవాడవారి వద్ద లభిస్తుంది.]

-ఎమ్. డి. రహమాన్

